

# ఎక్కడుంది శాంతి?

పవని నిర్మల ప్రభావతి

సూట్‌కేసు చేతబట్టుక, బస్ స్టాండు నుంచి షుమారు రెండు ఫర్లాంగులు నడిచేసరికి, ఈశ్వరికి ఆయాసం వచ్చి నట్లయింది. ఆశ్రమంగేటు దగ్గరకు వచ్చేసరికి, ఓ యువకుడు ఎదురొచ్చాడు గబగబా!

"మీరు ఈశ్వరిగారు కదండీ! మీరు వస్తున్నట్లు వ్రాసిన ఉత్తరం, మా స్వామీజీకి మొన్ననే అందింది. నన్ను బస్‌స్టాండ్ దగ్గరకు వెళ్ళమన్నారు. ఈ లోగా ఆశ్రమంలో చిన్న పని తగిలి, అది సవరించుక వచ్చేసరికి, బస్సు రావటమూ, మీరు రావటమూ జరిగి పోయింది. క్షమించాలి!" అన్నాడు వినయంగా. చదువూ, సంస్కారం వుట్టిపడుతున్నా యతగాడిలో.

"ఫర్వాలేదు లెండి! బస్‌స్టాండ్‌లో దిగితే, నేరుగా త్రోవంట వెళ్ళమని చెప్పారు. వచ్చేశాను!" అంది ఈశ్వరి. ఈసరి కామె అలసట కొంచెం తగ్గింది.

"నా పేరు జగన్నాథ్! ఆశ్రమం నుంచి వెలువడలయ్యే ఆధ్యాత్మిక, వార, మాస పత్రికల తాలూకు ప్రింటింగ్ వర్క్ అంతా పర్యవేక్షిస్తుంటాను. నిజానికి నేను హేతువాదిని. దేవుళ్ళన్నా, దెయ్యాలన్నా, ఆశ్రమాలన్నా నాకు నమ్మకంలేదు సరికదా, ఎలర్జీ కూడాను! అయితే ఏంచేస్తాం? జీవనపోరాటం కొన్ని ఆదర్శాలని పీకనొక్కేలా చేస్తుంది మేడం! ఎం.ఏ. యూనివర్సిటీ ఫస్టు వచ్చిన నాకు ఆరేళ్ళు ఏ ఉద్యోగమూ దొరకలేదు. ఇక దొరుకుతుందన్న ఆశా మిగల్లేదు. ఈలోగా ప్రేమించటమూ, పెళ్లాడటమూ, ఇద్దరు పగపిల్లలు పుట్టుకురావటమూ మాత్రం జరిగి పోయాయి. స్వామీజీ ప్రింటింగ్ వర్క్ చూడమని నన్ను కోరినప్పుడు, అన్ని వాదాల్నీ పక్కకు నెట్టి వెంటనే చేరి పోయాను. ప్రస్తుతం ప్రింటింగ్ ప్రెస్సే నాకు దేవుడు! స్వామీజీ కొందరు దొంగబాబాజీల్లా దేవుడిపేరు అడ్డుపెట్టుక, ఆధ్యాత్మికత తెరచాటుచేసుక నాటకం ఆడేవారు కారు కాబట్టి ఆయనగారిని ఓ ఉన్నతవ్యక్తిగానే గౌరవిస్తాను. రండి, ఇటువేపు వెళదాం!" అన్నాడు జగన్నాథ్. జగన్నాథ్ నిష్కపటంగా, కలుపుగోరు తనంగా మాట్లాడుతున్న తీరు చాలా నచ్చింది ఈశ్వరికి.

అయితే, అతగాడు తనచేతిలోని సూట్‌కేసు అందుకుంటాడేమోనని ఆశించటంవల్ల, ఆశాభంగం పొందింది. ఆశ్రమ వాతావరణం చాలా ప్రశాంతంగా వుంది. ఓ పర్ణశాలలా గాక, చుట్టూరా పెద్ద కాంపౌండ్ వాల్‌తో, పెద్ద పెద్ద భవనాలతో, రకరకాల ఫలపుష్పవృక్షాలతో పెద్దకోటలోనికి అడుగెట్టిన అనుభూతి కలిగిస్తోంది.

"అదుగో ఆ కనిపిస్తున్న పెద్దమేడ, ఆశ్రమం తాలూకు ప్రెస్‌ది. ఆశ్రమానికి స్వంత ప్రింటింగ్ ప్రెస్ వుంది. ఆధ్యాత్మిక వారపత్రిక ఒకటి, మాసపత్రిక ఒకటి, సంవత్సరానికో సంక్షిప్త భక్తి గ్రంథం ప్రచురిస్తాము. అవి చౌకలో, జిజ్ఞాసువులకు అందజేస్తాము. ఆ ప్రక్కన రూములుండే భవనం మీలా ఇక్కడ వుండిపోదల్చుకున్నవారికి కేటాయింపబడినది. ఆ వెనకాల పాక శాల. ఆ ప్రక్కన్నే ఆశ్రమ పాఠశాల. నెలకు ఇచ్చే డబ్బును బట్టి, రూముకు ఇద్దరు, ముగ్గురు వుంటారు," అన్నాడు జగన్నాథ్.

"ఒక్కరే వుండే వీలు లేదా?

కావలిసై అదనంగా డబ్బు చెల్లించ గలను!" అంది ఈశ్వరి.

"ఇంతవరకు ఎవరూ అలా వుండ లేదు. మరి మీ విషయం ఏంచేస్తారో స్వామీజీ. ఇక్కడ ఎవరి పన్లు వారు చేసుకోవలసిందే. ముఖ్యమైన నిర్ణయాలు మాత్రం స్వామీజీ చేస్తారు. వారి ఆజ్ఞను అందరం శిరసావహించవలసిందే! అదుగో ఆ భవనంలోని మేడమీది గదే స్వామీజీది. మీరు స్నానం వగైరా కానివ్వండి. మీరు కాఫీ, టీ, పాలు ఏది పుచ్చుకుంటానంటే అది మీకు ఆశ్రమ పాకశాలలోనివారు ఇస్తారు. ఇడ్లీ, ఉప్మా చేస్తారు రోజూ! మీరు కాఫీ, టిఫిన్ పుచ్చుకున్నాక పైకి స్వామీజీ దగ్గరకు వెడదాం!"

ఈశ్వరి తలూపింది. నిన్న రాత్రంతా బస్సులో ప్రయాణంచేసి రావటంవల్ల నిద్రలేమితో, అలవాటులేని నడకతోనూ, అలసటగానూ, నీరసంగా వుందామెకు. జగన్నాథ్, అక్కడున్న స్త్రీల కామెను పరిచయం చేసి, ఓ అరగంట తర్వాత వస్తానని చెప్పి వెళ్లాడు. మధ్యవయసు స్త్రీలు పాడిపశువుల పన్లు చూస్తున్నారు. వృద్ధస్త్రీలు కొందరు కూరగాయలు తరగటం, పప్పుదినుసులు, బియ్యం శుభ్రంచేయటంలాంటి పన్లు చేస్తున్నారు. యువకులు నీళ్లుమోసేవారు కొందరూ, వృద్ధులూ అన్ని పన్లు చేసుకుపోతున్నారు. పెద్ద యంత్రగారంలో మీట నొక్కితే యంత్రాలు తిరిగినట్లుగా, ఎవరి పన్లు వాళ్లు చకచక చేసుకుపోవటం చూస్తుంటే ఈశ్వరికి చాలా ఆనందం కలిగింది. స్వామీజీ వుండే భవనం క్రింది వాటాలో ఆశ్రమం తరఫున పాఠశాల వుంది. పిల్లలందరూ బిలబిల వచ్చేశారు టిఫిన్ తినటానికి.

ఈశ్వరి స్నానంచేసి, కాఫీ టిఫీనూ పుచ్చుకునేసరికల్లా జగన్నాథ్ వచ్చే శాడు. స్వామీజీ రూంలోకి అడుగెట్టుంటే గుండె దడదడలాడింది ఈశ్వరికి. ఈ ఆశ్రమాన్ని గురించీ, ఈ స్వామీజీ గురించీ, చాలా గొప్పగా విన్నది.

ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వున్న ఆ హాలులో, స్వామీజీ గోడ ప్రక్కగా దర్భాసనంమీద కూర్చుని, ముందున్న చిన్న డెస్కుమీద, బహుశా ఆధ్యాత్మిక వార మాసపత్రికల తాలూకు ప్రూఫులు కాబోలు దిద్దుతున్నారు. కళ్ళజోడు, బాగా నెరసిన పెద్దగడ్డమూ, బట్టతలా, తెల్లని రంగూ, దివ్యతేజస్సుతో ఆయన గారు చిత్రాలలో కనిపించే రవీంద్రనాథ్ టాగూర్‌ను తలపింపజేస్తున్నా రనిపిం చింది ఈశ్వరికి. అలికిడి విని తలెత్తి చూచి, జగన్నాథ్‌వంక చూచి చిరునవ్వు నవ్వి, "ఈశ్వరి గారేనా?" అన్నారు. గంభీరంగా వుందా కంఠస్వరం. జగన్నాథ్ తలూపాడు. ఈశ్వరి "నమస్కారం" అంటూ చేతులు జోడిం చింది భక్తిగా.

"కృష్ణార్పణం! కూర్చో తల్లీ!" ఆ పిలుపెంతో వాత్సల్యంతో నిండి వుంది. గుండెదడ తగ్గింది. ఆయనగారికి కాస్త దూరంలో పరిచివున్న తుంగచాపమీద ఒద్దికగా కూర్చుంది. జగన్నాథ్ తన పని పూర్తయినట్లు, మౌనంగానే శలవు పుచ్చుక వెళ్ళిపోయాడు.

"మీ సన్నిహిత బంధువుల అనుమతి తీసుకరావలసిందిగా, నీ ఉత్తరానికి జవాబు వ్రాస్తూ వ్రాసిన ఉత్తరం నీకు చేరింది కదమ్మా! అనుమతి తీసుకొనే వచ్చావా?" స్వామివారు మృదువుగా అడిగారు. ఈశ్వరి తలూపింది.

"ఆశ్రమంలో శాశ్వతంగా వుండి పోవాలన్న కోరిక నీ కెందుకు కలిగింది? నిజం చెప్పు తల్లీ! సాధ్యమైనంతవరకూ అబద్ధాలు చెప్పకుండా వుండటం, చెప్పించకుండా వుండటం, మా ఆశ్రమ నియమాలలో ఒకటి. తాత్కాలిక ఆవేశా లతో ఇంట్లోనివారిమీద కోపంతోనో, ద్వేషంతోనో పారిపోయి వచ్చేవారికి ఆశ్రమం ఆశ్రయం కల్పించదు. కొందరికి గృహంలో ఏ ఆధారమూ లేదని ఋజువైతే, పోషణ భారం వహిస్తాము. నీ గృహ పరిస్థితీ, నీ ధ్యేయమూ దాచకుండా చెప్పమ్మా!" అన్నారు స్వామీజీ, వాత్సల్యం నిండిన చూపులతో ఆమెని చూస్తూ. ఈశ్వరికి బాగా ధైర్యం వచ్చింది.

"నాపేరు ఈశ్వరి. నా భర్తగారి రాధాకృష్ణగారు. ఇద్దరం ఎం.ఏ.,బి.ఇడి. పాసైనవారమే. ఇద్దరం కాలేజీ లెక్చరర్లుగా పనిచేశాం. ప్రిన్స్‌పాల్స్‌గా ప్రమోట్ చేయబడ్డాం కూడాను. మావారు ఆరేళ్ళ క్రితం రిటైర్ అయ్యారు. నేను ఏడాది క్రితం రిటైర్ అయ్యాను. మాకు ఇద్దరబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. అందరికీ చదువులూ, పెళ్లిళ్లూ అయి, పిల్లలు కూడాను. నాలుగు జంటలూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు." క్షణ కాలం ఆగింది ఈశ్వరి.

"మీ శ్రీవారు అనుమతి ఇచ్చారా, నువ్విలా రావటానికి?"

"ఆఁ! మొదట అంగీకరించలేదు. కానీ నా కోర్కె కాదనలేక, నా బల వంతంమీదే ఒప్పుకున్నారు. వారిప్పుడు ఇంటిదగ్గరే ఓ పాఠశాల నడుపుతున్నారు. పిల్లలకు స్కూళ్ళలో చెప్పే చదువులు నిజమైన చదువులు కావనీ, ప్రకృతినుంచి పిల్లలు నేర్చుకోవలసింది చాలా వుందనీ అంటారు. ఆ మేరకు పిల్లలందర్నీ వెంటవేసుక, వారానికోమారు నగరానికి ఆవలనున్న అడవికీ, నదికీ, కొండ దగ్గరకూ....అలా పిలుచుకు వెళతారు.

"మిగతా వారాల్లో పాఠాలూ, యోగా భ్యాసాలూ, వృత్తి విద్యా శిక్షణలూ, ఇలా ఏవేవో ఏర్పాటుచేశారు. నన్నూ తనతోబాటు ఆ కార్యక్రమంలో పాల్గొన మని చెప్పారు. ఊహూఁ! నావల్ల కాదు. నేను జీవితంలో చాలా భాగం

పిల్లలకి పాఠాలు చెప్పి, చెప్పి విసిగిపోయాను. నా స్వంతబిడ్డల పెంపకమూ, చదువులూ, పెళ్ళిళ్ళతో సమస్యల వలయాలతో చికాకుపడిపోయాను. నా కిప్పుడు కావలసింది శాంతి. ఏ బరువూ బాధ్యతలు లేని ప్రశాంతి. అంచేత నేనీ ఆశ్రమంలో వుండదలచి, మీకు ఉత్తరం వ్రాశాను. మీరూ, మావాళ్ళ అనుమతి తీసుకురావలసిందిగా జవాబు ఇచ్చారు. అదీ సంగతి!" ఈశ్వరి అంతా చెప్పి, ఆగింది. స్వామీజీ సాలోచనగా తల పంకించారు.


"మనవళ్లు, మనవరాళ్లు వాళ్ల ఆలనా పాలనా వహించమంటారు కొడుకులు, కోడళ్లు....నా కిష్టంలేదు. అదో మాయ. తిరిగీ అదో చిక్కుముడి. మీవంటి మోసమూ, కపటమూలేని సాధువుద్వారా గురుబోధ పొంది, ఇక్కడే శేషజీవితం గడిపివేయాలని వుంది. సర్వ మమకారాలను తెంచివేసుక వచ్చేశాను. నాకు నెలకయ్యే ఖర్చు ఇంటినుండి వస్తుంది. నా కొక్కత్తెకూ ఓ రూం కేటాయిస్తే చాలు. ఇతరులతో కలిసివుండటం నా కిష్టం వుండదు." ఆమె కంఠంలో అనుకోకుండా రాజసం ధ్వనించింది.

"మంచిది. జగన్నాథ్ నీ బస ఏర్పాట్లన్నీ చూస్తాడు. కానీ, రూంలు అన్నీ నిండిపోతే, నీవూ మరొకరిద్దరితో సర్దుకొని తీరాలి. సహజీవనం తప్పదు. అందాకా వంటరిగా రూం ఇస్తాం. గురుబోధకోసం తొందరపడకు తల్లీ! సమయం వచ్చినప్పుడు గురుబోధ దానంతటదే జరుగుతుంది!"

స్వామీజీ ఇక చెప్పవలసిందేమీ లేదన్నట్లు కాగితాలు చూసుకుంటున్నారు. ఈశ్వరి శలవు తీసుక, మేడదిగి వచ్చేసింది.

* * *

మూడు నెలలు గిర్రున తిరిగాయి. ఈశ్వరి ఆశ్రమంలోని ప్రింటింగ్ ప్రెస్



వుండే భవనంలోని ఆఫీసురూంలో పెద్ద టేబిల్ వెనకాల గాడ్రేజ్ రివాల్వింగ్ ఛేర్‌లో కంఫర్టబుల్‌గా కూర్చునివుంది. ఆమె ముందు టేబిల్‌మీద ఆధ్యాత్మిక వార, మాసపత్రికలూ, ప్రూఫ్‌లు దిద్దవలసిన ప్రతులు, ఒక క్రమపద్ధతిలో వున్నాయి. రాష్ట్రంలోని ఎందరో ప్రముఖుల నుంచీ, జిజ్ఞాసువుల నుంచీ, రాష్ట్రేతరులలో, ఆధ్యాత్మికంపట్ల ఆసక్తి వున్నవారినుండీ వచ్చిన ఉత్తరాలెన్నో వున్నాయి. ఈశ్వరి జవాబులు డిక్టేట్ చేస్తుంటే, టైప్‌చేసి పంపటానికి (సంతకం మాత్రం స్వామీజీ పెడతారు) ఓ టైపిస్ట్, టైప్‌రైటర్ ఆ గదిలోనే ఆమె కొద్ది దూరంలో వున్నారు. ఈ మూడు నెలలుగా అప్పగింపబడిన ఈ బాధ్యత ఆమె చాలా చక్కగా నిర్వహిస్తోంది. స్వామీజీ కూడా మెచ్చుకున్నారు. ఆశ్రమ వార, మాసపత్రికల కామె పరోక్ష ఎడిటింగ్‌లో చాలా ఆకర్షణీయంగానూ, ఆసక్తిదాయకంగానూ వెలువడుతున్నట్లు, ఆధ్యాత్మిక అభిమానుల, మేధావుల (పాఠకుల) లేఖల ద్వారా వెల్లడౌతోంది! మెల్లగా ఆమె ఆశ్రమంలోని అన్ని శాఖల అజమాయిషీ చేసే స్థాయికి వచ్చేస్తోంది. రంగయ్య ఆశ్రమ వ్యవసాయశాఖ నిర్వహిస్తున్నాడు ఆరు ఏళ్లుగా. తోటలో కూరగాయలు పండించటం, ధాన్యం పండించటం అతగాడి విధి. జమాఖర్చులు ఈశ్వరి చూస్తుంది. అలాగే పాడిపశువుల దాణా వగైరా పున్నమ్మ అనే భర్తృపరిత్యక్త అయిన ఓ మధ్యవయసు యువతి చూస్తుంది. కానైతే ఆమె కట్టుకొనేది కాషాయ రంగు చీరె, రవికె, జగన్నాథ్‌ని చూచినప్పుడల్లా, మైమరచిపోయి, అతగాడి వెంట తగులుతుంటుంది. జగన్నాథ్ కది పరమచిరాకు.

"ఈ సైతాన్ పున్నమ్మ నెప్పుడో ఈ ప్రింటింగ్ ప్రెస్‌లో, బైండింగ్

మిషన్ క్రింద పెట్టి పచ్చడిగా చేసేస్తాను మేడమ్! వేసేవి కాషాయ వస్త్రాలు— చేసేవి—దరిద్రపు ఆలోచనలు!" అని మండిపడ్తుంటాడు. వీలు చిక్కినప్పుడల్లా పున్నమ్మని చివాట్లు పెడ్తుంటుంది ఈశ్వరి. పిల్లల పాఠశాలలో రెండు గంటలు పాఠాలు బోధిస్తుంది. సాయంత్రం తీరికవేళలో, జగన్నాధ్ యింటికి వెళ్తుంటుంది. వారానికో మారు. జగన్నాధ్ భార్య సరళ కూడా గ్రాడ్యుయేట్. ఇద్దరు మగపిల్లలు. ముచ్చటైన సంసారం.

"రండి వదినగారూ!" అంటూ సరళ చాలా చక్కగా మర్యాదచేసి కబుర్లు చెబుతుంది. తన చిన్నకొడుకు, కోడలు గుర్తొస్తారు ఆ సమయంలో. టైం ఇట్టే గడిచిపోతుంది. ఆశ్రమంలో ఊపరి సలపని వ్యాపకమూ వుంది. అందరి గౌరవమన్ననలూ పొందగలుగుతోంది. సలహాల నిస్తోంది.

* * *

మరో ఆరునెలలు గిర్రున తిరిగాయి. ఆరోజు, రోజూలాగే ఆధ్యాత్మిక మాస పత్రిక కోసం వచ్చిన వ్యాసాలు పరిశీలిస్తోంది ఈశ్వరి. సంసారమాయను గురించి చాలా చక్కగా వ్రాసుకొచ్చాడా రచయిత.

"కొందరు వ్యక్తులు.... తమంత తాముగా బాధ్యతలని తలకెత్తుకుని.... ఆ వలయంలో చిక్కుకుని...."

చదువుతున్న ఈశ్వరికి హఠాత్తుగా మెరుపుకొట్టినట్లైంది! వ్యాసం అలాగే వదిలి, ఆలోచనలో పడింది. తనిక్కడికి వచ్చి తొమ్మిది నెలలైంది! గురుబోధ కోసం, శాంతికోసం మంత్రోపదేశం పొంది, జపసిద్ధికోసం వచ్చింది. కాని అనుకోకుండా స్వామీజీ "అమ్మా! జగన్నాధ్ ఒక్కడే ప్రింటింగ్ ప్రెస్ బాధ్యత చూసుకోలేక సతమతమౌ తున్నాడు. అతగాడికి కాస్త సాయంగా వుండు తల్లీ! నువ్వో కాలేజి ప్రిన్స్‌పాల్‌వి. ఏదెలా కంట్రోల్ చేయాలో నీకు అలవాటై వుంటుంది." అని చెప్పడంతో, తాత్కాలికంగా తీసుకున్న ఈ బాధ్యతను — వ్యాపకంగా మలచుకుని అందులోనే మునిగిపోయింది.... ఛ.... ఛ ఇదెంత తెలివితక్కువతనం!

ఇక మేలుకోవాలి. గురుబోధ తీసుకోవాలి.

"మేడం! మిమ్మల్ని స్వామీజీ ఓమారు పిల్చుకురమ్మన్నారు. మాస పత్రికలో కొన్ని సూచనలేవో ఇస్తార్ట," జగన్నాధ్ పిలుపుతో త్రుళ్ళిపడింది. మేడమీదకు వెళ్తూ, మరోమారు గట్టిగా నిర్ణయించుకుంది, ఈరోజు స్వామీజీ ద్వారా గురుబోధ పొందే తిరిగిరావాలి. ఈ బాధ్యత ఇక తనవల్ల కాదని చెప్పాలి.

"రామ్మా! కూర్చో!" స్వామీజీ సాదరంగా ఆహ్వానించారు. ఆమె తుంగ చాపమీద కూర్చుంది. ఆయనగారు చెప్పిన సూచనలు నోట్‌చేసుకుంది.

"ఇక వెళ్ళొచ్చమ్మా!" అని స్వామీజీ చెప్పేలోగా అంది.

"స్వామీజీ! ఈ రోజొక ముఖ్య విషయం మాట్లాడాలి మీతో!" దృఢంగా ధ్వనించిందామె కంఠం.

"చెప్పమ్మా!" సహజంగా అన్నారు ఆయన.

"తొమ్మిది నెలలైంది నే నిక్కడికి వచ్చి. ప్రింటింగ్‌ప్రెస్.... పాఠశాల, ఆశ్రమ నిర్వహణ....ఇలా ఒక్కో బాధ్యతా వచ్చి చుట్టుకుంటుందేమిటి నాకు? నే కోరింది మీనుంచి గురుబోధ, మంత్రోపదేశం. ఏకాంతంగా జపసిద్ధి!" అంది ఆవేశంగా.

క్షణకాలం స్వామీజీ ఆమెవేపు ప్రశాంతంగా చూశారు. ఆయనగారి ముఖంలో చిరునవ్వు వెలిగింది.

"నీ కింకా గురుబోధ జరగలేదా అమ్మా!" ఆశ్చర్యంగా అడిగారాయన గారు.

"ఎప్పుడూ? వచ్చిన మర్నాటినుంచి ప్రెస్ నిర్వహణ, పాఠశాల నిర్వహణ, ఆశ్రమ నిర్వహణ....ఇలా" విసుగ్గా అంది.

"ఆ బాధ్యతల నిర్వహణతోబాటే నీకు గురుబోధ జరిగిపోయింది తల్లీ! నువ్వు గుర్తించలేదు!"

"ఎప్పుడు? ఎప్పుడు?" ఆత్రుతగా అంది ఈశ్వరి.

"ఆశ్రమంలో నీ డబ్బుతో నువ్వు ఉండగలనన్న అహంతో ప్రవేశించావు నువ్వు. ఆశ్రమంచేత పోషింపబడేవారు అంతా విధిలేక పనిచేయాలి. అనే అతిశయం కూడా నీలో వుందానాడు. అలా పనిచేయవలసిన అవసరం నీకు లేదనే భావన కూడా వుంది. నేను నీ మాటలలో నీ ముఖకవళికలలో గ్రహించగలిగాను. నీ కొక్క రైటూ, ఓ మంత్రోపదేశం చేసి, రూం కేటాయించి, నిర్వ్యాపారంగా నిర్బాధ్యతగా కూర్చోబెట్టాననుకో.... ఆశ్రమం ఏమౌతుందో ఆలోచించు తల్లీ! నీలానే డబ్బు కట్టగలిగినవారంతా ఇది తమ "హక్కు" అన్నట్లు సోమరులుగా, ఒకానొక అతిశయ భావంతో ఆశ్రమంలో తిష్ఠవేస్తారు. ఇది మిగతా ఆశ్రమవాసుల్లో కించభావననూ, బాధనూ కలిగిస్తుంది....అంచేతే నీకు ప్రెస్ బాధ్యత, పాఠశాల బాధ్యత తాత్కాలికంగా అప్పగించాను.

"ఆ తర్వాత, నీలో ఇన్నేళ్ళుగా పెరిగిన సంస్కారం నిన్నూరికే కూర్చోనివ్వలేదు. పాఠశాల బాధ్యతతో బాటు, అన్ని శాఖల పెత్తనమూ, కాలేజీలోలానే నీ అంత నీవే తీసుకున్నావు.

"సృష్టి అంతటా ఔన్నత్యాలు, బలహీనతలూ సమానంగా వున్నాయి, చీకటి వెలుగుల్లాగా. అలాగే ఆశ్రమం

లోని వ్యక్తులలోనూ బలహీనతలూ, ఔన్నత్యాలూ కూడా వున్నాయి. అవి కూడా నీవు సవరించాలనే తపనలో పడ్డావు. ఫలితంగా పున్నమ్మని చీవాట్లు వేయటం, రంగయ్య వ్యవసాయపు పనుల్లో నష్టాలు వెతకటం, మార్కెటింగ్ శాఖ చూసే సుబ్బయ్య ఎంత శాతం కమిషన్ తీసుకుంటున్నాడని ఆరాలు తీయటం లాటివి కూడా చేసేస్తున్నావు. ఇంతటి క్రియాశీలక మనస్సు నీలో సజీవంగానూ చైతన్యవంతంగానూ వుండగా, మంత్రోపదేశం పొంది, నీవు ముక్కు మూసుక జపంచేస్తూ, "శాంతి" "ముక్తి" పొందాలనుకోవటం సాధ్యమా ఈశ్వరీ!" స్వామీజీ క్షణకాలం ఆగారు.

ఈశ్వరి నిర్ఘాంతపోయింది. జవాబు చెబుదామనుకునేలోగా స్వామీజీయే అన్నారు.

"ప్రేమించే భర్త, వాస్తవిక దృక్పథంతో ఆలోచించి ఓ ఆదర్శ పాఠశాల నడుపుతున్నారాయన. బిడ్డలు, మనవలు, మనవరాళ్లు అందరి మధ్యా వెతుక్కోలేని శాంతి, ఇక్కడ వుందని నీకు హామీ ఎలా ఇవ్వను కన్నతల్లీ! ఆ బుల్లి సంసారంలో నీకు దొరకని శాంతి ఏమిటి?" పకపక నవ్వారు స్వామీజీ. పసిబిడ్డ నవ్వులా, వెన్నెల విరిసినట్లుంది ఆ నవ్వు. ఈశ్వరి చిత్రంగా, కొత్త వ్యక్తిని చూస్తున్నట్లు చూస్తోందాయన గారి వేపు.

"గురుబోధ కోరావు - చేశాను. కానీ నువ్వు గుర్తించలేదు. ఇప్పుడూ అడిగావు బోధ కావాలని. నీ కోరిక మేరకు, మరో మారు చేస్తున్నాను. శ్రద్ధగా విను.

"కర్మతో ఉద్భవించిందీ జగత్తు. కర్మతోనే సాగుతోంది. కర్మలోనే అంతం అవుతుంది కూడాను."




"కనురెప్పల కదలిక మొదలు, శ్వాసకోశంనుంచి వెలువడే ఊపిరివరకూ శరీరంలోని అంగాంగంలోని సూక్ష్మ నరాల, ధమనుల, సిరల క్రమశిక్షణతో కూడుకున్న కర్మద్వారానే ప్రాణి పుట్టుక, మనుగడ, మరణమూ జరుగుతున్నాయి. మరిలా శరీరంలోని కనిపించని ధాతువులకే ఇంతటి కర్మ నిర్దేశింపబడి వుండగా శరీరధారి అయిన మనిషి కర్మనుంచెలా పారిపోగలరో చెప్పమ్మా!

"ఆశ్రమం అయ్యేది, గృహం అయ్యేది ఎవరెవరికి నిర్దేశింపబడిన పరిధిలో వారా పనులు ఆమరణాంతం చేసి తీరాలి. అదే దీక్ష, అదే మంత్రం. అదే సాధన. అదే తపస్సు. నిర్దేశింపబడిన కర్మనుంచి పారిపోయి 'శాంతి' పొందాలనుకోవడం సోమరితనమే తప్ప మరోటి కాదు. 'శాంతి' ఎక్కడా దొరకదు తల్లీ! ఆశ్రమల్లో డబ్బుకట్టి చేరి 'శాంతి' కొనుక్కోగలిగే పక్షంలో, కోటీశ్వరులూ, లక్షాధికారులూ కొందరు కపట రాజకీయవాదులూ తామే ప్రపంచంలోని 'శాంతి' నంతటినీ కొనేసి, తమ తర తరాలకు నిలవచేసుకొని వుందురు డబ్బులానే!

"మరోటి గుర్తుంచుకో తల్లీ ఈశ్వరీ! సృష్టికర్త తనంత తానుగా నిర్మించిన ఈ పెద్ద సంసారినికి, అనుబంధ సంసారాలే మీ గృహాలయినా, మా ఆశ్రమాలయినా. వాటినుంచి ఎవరం పారిపోలేం. పారిపోయినా, మరోరకం బాధ్యతలూ, మమకారాలూ, తప్పవు. వున్నంతలో శాంతినీ సంతృప్తినీ వెదుక్కోగలగటమే, మనిషి చేయవలసిన తపస్సు. ఇతరులకు అపకారం చేయని మార్గంలో సాగటమే సాధన!"

ఈశ్వరి అలాగే కూర్చుండిపోయింది చాలాసేపు. స్వామీజీ మరేమీ మాట్లాడలేదు. కాగితాలు చూసుకుంటూ వుండిపోయారు. మేడదిగి వచ్చేసిందామె.

*　　*　　*

ఆరునెలల తర్వాత....భర్త నడుపుతున్న ఆదర్శ పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెబుతున్న ఈశ్వరి, ఆ పిల్లల మధ్యలోనే వున్న తన మనవళ్లనీ, మనవరాళ్లనీ చూస్తూ తృప్తిగా నిట్టూర్చింది. ఆమె ఎదనిండుగా అవ్యక్తమైన శాంతి తరంగాలు వ్యాపించాయి.

———